16- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/16/2026 12:20 AM Page 1

మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
గురువారం 16 ఏప్రిల్ 2026 పేజీలు : 4

## తెలుగుదేశం పార్టీకి కొత్త దిశ, కొత్త శక్తి

### నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించడంపై ఎమ్మెల్యే ఏలూరి శుభాకాంక్షలు



తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన నారా లోకేష్‌కు ఎమ్మెల్యే ఏలూరి సాం బశివ రావు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నా యకత్వంలో పార్టీకి కొత్త దిశ, కొత్త శక్తి లభిస్తుందని పేర్కొన్నారు.

అమరావతి రక్షణ న్యూస్

వివరాలు 2లో..

# శిరోరక్ష.... ప్రాణరక్ష





- హెల్మెట్ లేకపోతే ప... ఇకపై కఠిన చర్యలు
- యువతకు నేరుగా ప్రశ్నలు వేసిన జిల్లా ఎస్పీ
- "శిరో రక్ష -- ప్రాణ రక్ష" స్పెషల్ డ్రైవ్‌పై ఆకస్మిక తనిఖీ
- ఈ నెల 16 నుంచి హెల్మెట్ లేకపోతే జరిమానాలు
- బాపట్లలో పెరుగుతున్న ట్రాఫిక్... ప్రమాదాలపై అవగాహన
- రానున్న రోజుల్లో నో హెల్మెట్ నో ఫ్యూయల్ ఆచరణ
- జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావు....

"ఏం పెద్దాయన... ఎక్కడినుంచి వస్తున్నావ్? ఎక్కడికి వెళ్తున్నావ్? హెల్మెట్ ఎందుకు పెట్టుకోలేదు బా బు? నీ పేరేంటి... నీ వయసెంత? యువత హెల్మెట్ లేకపోతే ఎన్ని ప్రమాదాలు జరుగుతు న్నాయో చూడటం లేదా?" అంటూ బాపట్ల జిల్లా ఎస్పీ ఉమా మహేశ్వర రా వు ద్విచక్ర వాహనదారులతో నేరుగా మాట్లాడారు. హెల్మెట్ ధరించిన వారిని కూడా ఆపి "ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిసి పెట్టుకున్నావా? లేక పోలీసులు అవగాహన చేస్తున్నారని పెట్టుకున్నావా?" అని ప్రశ్నించారు. "శిరో రక్ష -- ప్రాణ రక్ష" కార్యక్ర మంలో భాగంగా గత 15 రోజులుగా నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌పై బాపట్ల ఓల్డ్ బస్టాండ్ వద్ద ఆకస్మిక తనిఖీ చేసి ప్రజల్లో అవగాహన కల్పించారు.

బాపట్ల జిల్లా రక్షణ బ్యూరో



**ముఖ్య నిర్ణయాలు -- ఎస్పీ సూచనలు**

- ఈ నెల 16 నుంచి హెల్మెట్ లేకపోతే కఠిన చర్యలు
- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు
- మైనర్లు డ్రైవ్ చేస్తే కేసులు నమోదు
- లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరి

**బాపట్లలో ట్రాఫిక్ పరిస్థితి**

- వీకెండ్లలో 20 వేల నుంచి 50 వేల పర్యాటకుల రాక
- సెలవుదినాల్లో 2 లక్షలకు పైగా సందర్శకులు
- జాతీయ రహదారులపై వాహనాల రద్దీ పెరుగుదల
- ప్రమాదాల్లో 30--35% కారణం హెల్మెట్ లేకపోవడం





వివరాలు 2లో..

## ధరణికోటలో అన్న క్యాంటీన్ ప్రారంభం

### కార్మికులతో కలిసి భోజనం చేసిన సీఎం చంద్రబాబు
### రాష్ట్రంలో 269కి చేరిన అన్న క్యాంటీన్లు




వివరాలు 2లో..

పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలోని ధరణికోటలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. కార్యక్రమం అనంతరం పేదలు, కార్మికులకు స్వయంగా భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా ప్రారంభమైన క్యాంటీన్లతో రాష్ట్రంలో మొత్తం సంఖ్య 269కి చేరిందని సీఎం తెలిపారు.

పెదకూరపాడు రక్షణ న్యూస్

## బాపట్ల జిల్లాలో అభివృద్ధి వేగం.

- అన్న క్యాంటీన్ల నుంచి గ్రామ సేవల వరకు కలెక్టర్ దృష్టి
- భట్టిప్రోలులో అన్న క్యాంటీన్ ప్రారంభం...
- పేదలకు రూ.5కే భోజనం
- గ్రామ సచివాలయం
- ఆకస్మిక తనిఖీ... సేవలపై కలెక్టర్ ఆదేశాలు
- జలధార--జలహారతి, గోదాముల బిల్లులు, ఇసుక తవ్వకాలపై కీలక నిర్ణయాలు



వివరాలు 2లో..

బాపట్ల జిల్లాలో ప్రజా సేవలు, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలు అవుతున్నాయని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఐఏఎస్ తెలిపారు. భట్టిప్రోలు మండలంలో అన్న క్యాంటీన్ ప్రారంభం, గ్రామ సచివాలయం తనిఖీ, జలధార--జలహారతి కార్యక్రమంపై సమీక్ష, రైతుల గోదాముల బిల్లుల చెల్లింపులు, ఇసుక తవ్వకాలపై నిర్ణయాలు వంటి పలు అంశాలపై ఆయన బుధవారం సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

బాపట్ల రక్షణ న్యూస్

16- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/16/2026 12:20 AM Page 2



# ధరణికోటలో అన్న క్యాంటీన్ ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

**పెదకూరపాడు రక్షణ న్యూస్**

పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలోని ధరణికోటలో ఏర్పాటు చేసిన రూరల్ అన్న క్యాంటీన్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రారంభించారు. క్యాంటీన్ ప్రారంభం అనంతరం రూ.5 టోకెన్ కొనుగోలు చేసిన సీఎం అక్కడికి వచ్చిన పేదలు, కార్మికులకు స్వయంగా భోజనం వడ్డించారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి అన్న క్యాంటీన్‌లోనే భోజనం చేశారు. భోజనం రుచి, నాణ్యత, శుభ్రత గురించి అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పేదల ఆకలి తీరితేనే నిజమైన అభివృద్ధి సాధ్యమని అన్నారు. ప్రజలకు ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించామని చెప్పారు. ముందుగా పట్టణ ప్రాంతాల్లో ప్రారంభించిన క్యాంటీన్లను ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఇప్పటికే పట్టణాల్లో 204, గ్రామీణ ప్రాంతాల్లో 65 కలిపి మొత్తం 269 అన్న క్యాంటీన్లు పనిచేస్తున్నాయని సీఎం వెల్లడించారు. త్వరలో మరో ఐదు క్యాంటీన్లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. గడచిన 21 నెలల్లో అన్న క్యాంటీన్ల ద్వారా 8.80 కోట్ల భోజనాలు పేదలకు అందించినట్లు చెప్పారు. ప్రస్తుతం రోజుకు సుమారు 2.10 లక్షల మంది అన్న క్యాంటీన్లలో భోజనం చేస్తున్నారని వివరించారు.

ఈ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీకి కొత్త దిశ, కొత్త శక్తి

మొదటి పేజీ తరువాయి

**అమరావతి రక్షణ న్యూస్**

తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన మంత్రి నారా లోకేష్ సారథ్యంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. దూరదృష్టి గల నాయకుడు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వ వారసత్వాన్ని అందిపుచ్చుకుని, యువత ఆలోచనలకు దగ్గరగా ఉండే శక్తివంతమైన నాయకుడిగా లోకేష్ ఎదుగుతున్నారని అన్నారు.పార్టీ పట్ల అంకితభావం, ప్రజల పట్ల బాధ్యత ఆయన నాయకత్వానికి ప్రధాన బలమని పేర్కొన్నారు. విద్యాశాఖలో ఆధునిక మార్పులు, డిజిటల్ విద్యకు ప్రోత్సాహం, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత పెంపు వంటి చర్యలు భవిష్యత్ తరాలకు బలమైన పునాది వేస్తాయని తెలిపారు.అలాగే ఐటీ రంగంలో పెట్టుబడులు, యువతకు ఉపాధి అవకాశాల సృష్టి ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని బలోపేతం చేస్తూ కార్యకర్తలకు స్ఫూర్తిగా నిలుస్తున్న లోకేష్ నాయకత్వం తెలుగుదేశం పార్టీకి మరింత శక్తిని, విజయాన్ని అందించాలని ఎమ్మెల్యే ఏలూరి ఆకాంక్షించారు.

# శిరోరక్ష... ప్రాణరక్ష

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల జిల్లా రక్షణ బ్యూరో**

బాపట్ల జిల్లాలో ద్విచక్ర వాహనదారుల భద్రతపై పోలీసులు మరింత దృష్టి సారిస్తున్నారు. “శిరో రక్ష -- ప్రాణ రక్ష” అనే నినాదంతో గత 15 రోజులుగా జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ ఉమా మహేశ్వర రావు స్వయంగా రోడ్డుపైకి వచ్చి వాహనదారులతో మాట్లాడారు. హెల్మెట్ ధరించని వారిని ఆపి కారణాలు అడిగి తెలుసుకోవడమే కాకుండా, ప్రమాదాల తీవ్రతపై వారికి వివరంగా అవగాహన కల్పించారు.

బాపట్ల ఓల్డ్ బస్టాండ్ వద్ద నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఎస్పీ స్వయంగా పాల్గొని యువతతో నేరుగా సంభాషించారు. “హెల్మెట్ పెట్టుకోకపోతే అది మీ కుటుంబానికి తీవ్ర నష్టం కలిగించవచ్చు. ప్రమాదం జరిగితే ఎక్కువగా ప్రాణనష్టం జరగడానికి ప్రధాన కారణం హెల్మెట్ ధరించకపోవడమే” అని ఆయన స్పష్టం చేశారు. హెల్మెట్ అనేది కేవలం పోలీసుల భయం వల్ల పెట్టుకునే వస్తువు కాదని, అది ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని ఆయన పేర్కొన్నారు.జిల్లాలో ట్రాఫిక్ రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరం ఉందని ఎస్పీ చెప్పారు. బాపట్ల జిల్లా ఏర్పడిన తర్వాత ప్రధానంగా ఎన్--16, ఎన్--216, ఎన్--167 వంటి జాతీయ రహదారులపై వాహనాల రద్దీ గణనీయంగా పెరిగిందన్నారు. జిల్లా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో వీకెండ్ రోజుల్లో భారీగా పర్యాటకులు వస్తుండటంతో ట్రాఫిక్ మరింతగా పెరుగుతోందని తెలిపారు.ప్రత్యేకంగా సూర్యలంక, రామాపురం వంటి బీచ్ ప్రాంతాలకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు భారీగా వస్తున్నారని ఎస్పీ పేర్కొన్నారు. ఒక్క వీకెండ్‌లోనే 20 వేల నుంచి 50 వేల వరకు పర్యాటకులు వస్తుండగా, సెలవుదినాల్లో ఈ సంఖ్య రెండు లక్షలకు పైగా చేరుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు సంఖ్య పెరగడంతో ప్రమాదాల అవకాశాలు కూడా అధికమవుతున్నాయని చెప్పారు.


అందుకే జిల్లాలో గత 15 రోజులుగా మూడు దశల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. మొదటి దశలో హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించామని చెప్పారు. రెండో దశలో హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల జరిగే ప్రమాదాలు, ప్రాణనష్టం గురించి ప్రజలకు వివరించామని పేర్కొన్నారు. మూడో దశలో ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరాన్ని తెలియజేశామని చెప్పారు.ఈ అవగాహన కార్యక్రమం ఈ నెల 15తో ముగుస్తుందని, 16వ తేదీ నుంచి హెల్మెట్ ధరించకుండా ప్రయాణించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. జరిమానాలు విధించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు స్వచ్ఛందంగా హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని కోరారు.

యువతకు ప్రత్యేకంగా సూచనలు చేస్తూ “బైకు నడిపేటప్పుడు లైసెన్స్ ఉండాలి. అలాగే హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. ఇది చట్టపరమైన నిబంధన మాత్రమే కాదు, ప్రాణ రక్షణ కోసం అవసరం” అని చెప్పారు. ముఖ్యంగా యువతలో హెల్మెట్ ధరించే అలవాటు పెంపొందాలని ఆయన కోరారు.మహిళలు కూడా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరించాలని ఎస్పీ సూచించారు. ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు కుటుంబ సభ్యులకు కూడా హెల్మెట్ ధరించాలని మహిళలే గుర్తు చేయాలని ఆయన కోరారు. కుటుంబంలో ఒకరికి ప్రమాదం జరిగితే ఆ కుటుంబం మొత్తం ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పారు.

జిల్లాలో జరిగిన ప్రమాదాల విశ్లేషణ ప్రకారం దాదాపు 30 నుంచి 35 శాతం ప్రాణనష్టం కేవలం హెల్మెట్ ధరించకపోవడం వల్లే జరుగుతోందని ఎస్పీ వెల్లడించారు. ఈ పరిస్థితిని మార్చాలంటే ప్రజలలో అవగాహన పెరగడం చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు.మైనర్లు వాహనాలు నడపడం కూడా ప్రమాదకరమని ఎస్పీ హెచ్చరించారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు.అదేవిధంగా జిల్లా శాంతి భద్రతల విషయంలో పోలీసులు ఎలాంటి రాజీ పడబోరని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు మరియు పోలీసుల మధ్య ఎలాంటి దూరం లేకుండా పనిచేయడం వల్ల జిల్లాలో క్రైమ్ రేట్ తగ్గుముఖం పట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్రైమ్ రేట్ పరంగా జిల్లా రెండో స్థానంలో ఉందని తెలిపారు.ఇటీవల ముఖ్యమంత్రి చీ.జ్ఞుఙుఅుతీఙుఝుఎబ చీుఅుబతో జరిగిన సమావేశంలో కూడా బాపట్ల జిల్లా పోలీస్ పనితీరును ప్రశంసించారని ఎస్పీ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ పనితీరులో జిల్లా నాలుగో స్థానంలో నిలిచిందన్నారు.ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు ఇవ్వాలంటే ముందుగా సంబంధిత పోలీస్ స్టేషన్‌లోనే ఇవ్వాలని ఎస్పీ సూచించారు. అక్కడ పరిష్కారం లేకపోతే మాత్రమే ఎస్పీ కార్యాలయానికి రావాలని కోరారు. ఇలా చేస్తే సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని చెప్పారు.గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారంలో కూడా జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా భూ వివాదాలు, కుటుంబ తగాదాలు ఎక్కువగా ఫిర్యాదుల రూపంలో వస్తున్నాయని చెప్పారు. వాటిని పరిష్కరించేందుకు పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారని వెల్లడించారు.మొత్తం మీద ద్విచక్ర వాహనదారుల భద్రత కోసం హెల్మెట్ ధరించడం అత్యంత అవసరమని ఎస్పీ మరోసారి స్పష్టం చేశారు. హెల్మెట్ అనేది కేవలం ట్రాఫిక్ నియమం కాదు, ప్రతి కుటుంబానికి భద్రత కలిగించే బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

# నగరంలో డ్రైన్ పనుల వేగం

**గుంటూరు రక్షణ న్యూస్**



బృందావన్ గార్డెన్స్, లక్ష్మీపురం మెయిన్ రోడ్లలో డ్రైన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, విద్యుత్ శాఖల సమన్వయంతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.బృందావన్ గార్డెన్స్ మెయిన్ రోడ్‌లో 2300 మీటర్ల డ్రైన్‌లో 1007 మీటర్లు పూర్తయ్యాయని, 23 కల్వర్టులలో 6 నిర్మాణం పూర్తైందన్నారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్‌లో 1155 మీటర్లలో 793 మీటర్లు పూర్తయ్యాయని తెలిపారు. అలాగే విద్యుత్ స్తంభాల మార్పిడి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.పనులు పూర్తయ్యే వెంటనే నిర్మాణ వ్యర్థాలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, నిర్మాణ సామగ్రి రోడ్లపై కాకుండా పక్కన ఉంచాలని కాంట్రాక్టర్లకు సూచించారు. మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.

# బాపట్ల జిల్లాలో అభివృద్ధి వేగం...

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల జిల్లాలో ప్రజా సంక్షేమం, మౌలిక వసతులు, పరిపాలనా సేవల మెరుగుదల కోసం జిల్లా యంత్రాంగం పలు కీలక చర్యలు చేపడుతోంది. జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఐఏఎస్ ఆధ్వర్యంలో బుధవారం భట్టిప్రోలు మండలంలో పలు కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు వివిధ శాఖల పనితీరుపై సమీక్షలు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు భోజనం అందించే అన్న క్యాంటీన్ ప్రారంభం నుంచి గ్రామ సచివాలయ సేవల తనిఖీ, జల వనరుల అభివృద్ధి, రైతులకు సంబంధించిన గోదాముల బిల్లుల చెల్లింపులు, ఇసుక తవ్వకాలపై చర్యలు వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించారు.భట్టిప్రోలు మండల కేంద్రంలో రూ.61 లక్షల వ్యయంతో నిర్మించిన అన్న క్యాంటీన్ను స్థానిక ఎమ్మెల్యే నక్క ఆనంద బాబు తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రతినిధి పాల్గుణ దాస్ కూడా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు, కూలీలకు తక్కువ ధరకు నాణ్యమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తోందని కలెక్టర్ తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి . చంద్రబాబు నాయుడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకోవడం వల్ల పేద ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 62 అన్న క్యాంటీన్లు ప్రారంభించబడుతున్నాయని చెప్పారు. ఇప్పటికే బాపట్ల, చీరాల, రేపల్లె పట్టణాల్లో అన్న క్యాంటీన్లు పనిచేస్తున్నాయని, ఇప్పుడు భట్టిప్రోలు మండల కేంద్రంలో ప్రారంభించడం ద్వారా వేమూరు నియోజకవర్గ ప్రజలకు మరింత సౌకర్యం కలుగుతుందని తెలిపారు.అలాగే పర్చూరు నియోజకవర్గంలోని మార్టూరు మండలంలో జాతీయ రహదారి వద్ద మరో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ రెండు క్యాంటీన్లు గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు, పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. ప్రజలు ఈ క్యాంటీన్లను ఉపయోగించుకుని నాణ్యమైన భోజనం పొందాలని సూచించారు.ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే నక్క ఆనంద బాబు మాట్లాడుతూ, పేదలకు ఆకలి తీరుస్తూ తక్కువ ధరలో భోజనం అందించాలనే ఉద్దేశంతో అన్న క్యాంటీన్లను ప్రారంభించడం రాష్ట్ర ప్రభుత్వ గొప్ప నిర్ణయమని పేర్కొన్నారు. 2014లో ప్రారంభించిన ఈ పథకం మళ్లీ అమలులోకి రావడం ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. వేమూరు నియోజకవర్గంలో భట్టిప్రోలు పెద్ద మండలం కావడంతో ఇక్కడ అన్న క్యాంటీన్ ప్రారంభించడం ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.ఈ సందర్భంగా భట్టిప్రోలులో ఒక దాత బావ నారాయణ 500 మందికి భోజన ఖర్చును అందజేయడంతో జిల్లా కలెక్టర్ మరియు ఎమ్మెల్యే ఆయనను అభినందించారు.అన్న క్యాంటీన్ ప్రారంభ కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ భట్టిప్రోలు గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేమూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి మరియు జిల్లా పంచాయతీ అధికారి ఎల్. ప్రభాకర్ రావు, రేపల్లె ఆర్డీఓ బి. శ్రీదేవి తదితరులతో కలిసి సచివాలయంలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు.సచివాలయ ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు, బర్రెల గ్రౌండ్, దేవాలయ భూములు తదితర వివరాలను మ్యాప్ రూపంలో సిద్ధం చేయాలని వీఆర్వోకు సూచించారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని చెప్పారు.సచివాలయంలో అందుబాటులో ఉన్న కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు, బయోమెట్రిక్ పరికరాలు తదితర వివరాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. సిబ్బంది ఖాళీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి మరియు ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.అదే రోజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి . సాయి ప్రసాద్ తో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కూడా జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. "జలధార -- జలహారతి" కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలని సీఎస్ సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లోని చెరువులు, నీటి నిల్వ ట్యాంకులను నీటితో నింపాలని ఆదేశించారు.గ్రామాల వారీగా చెరువులను గుర్తించి పూడికతీత, మరమ్మతులు, ఆక్రమణల తొలగింపు వంటి పనులు చేపట్టాలని సూచించారు. చెరువులలో నీటి నిల్వలు పెరగడం వల్ల భూగర్భ జల మట్టం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే రీ సర్వే ప్రక్రియను 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వేలో ఉన్న సమస్యలను పరిష్కరించి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తామని తెలిపారు. 22-ఏ నిషేధిత భూముల జాబితా నుంచి అర్హులైన పట్టా భూములను తొలగించి యాజమాన్య హక్కులు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.అలాగే సహకార శాఖ జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో రైతుల ప్రయోజనాల కోసం నిర్మించిన గోదాముల బిల్లులను తక్షణమే చెల్లించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో నూతనంగా నిర్మించిన నాలుగు గోదాములకు రూ.50.56 లక్షల బిల్లులు ఉన్నాయని తెలిపారు. వాటి చెల్లింపులకు కమిటీ ఆమోదం తెలిపినట్లు చెప్పారు.ఈ గోదాములను మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్లుగా రైతులు వినియోగించుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు నగదు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.అదేవిధంగా జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కూడా కలెక్టర్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జిల్లాలో ఇసుక తవ్వకాలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. గాజుల్లంక ఇసుక రేవులో 72,600 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉందని, చిలుమూరులో 73,050 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు.ఈ ప్రాంతాల్లో ఇసుక తవ్వకాల కోసం ఏజెన్సీలను ఆహ్వానించి వారంలోపు టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. వేసవి కాలంలో నిర్మాణ పనులు ఎక్కువగా జరుగుతాయని, అందుకే ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండేలా వేగంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు.మొత్తం మీద బాపట్ల జిల్లాలో ప్రజా సేవలు మెరుగుపడేలా, రైతులకు ప్రయోజనం కలిగేలా, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని అధికారులు తెలిపారు. అన్న క్యాంటీన్లు, గ్రామ సచివాలయ సేవలు, జల వనరుల అభివృద్ధి, రైతుల గోదాములు, ఇసుక సరఫరా వంటి అంశాలపై సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# తెనాలి డ్రగ్స్ కలకలం

**తెనాలి రక్షణ న్యూస్**

గుంటూరు జిల్లా తెనాలిలో డ్రగ్స్ వ్యవహారం కలకలం రేపింది. మంగళవారం రాత్రి త్రీ టౌన్ పోలీసులు ఈగల్ టీంతో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించి సుల్తానాబాద్ మార్కెట్ యార్డ్ ఎదురుగా ఉన్న కార్ ట్రావెల్స్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు.బెంగళూరు నుండి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ఎండిఎంఏ డ్రగ్స్ తెనాలికి తెప్పించి వినియోగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ దాడుల్లో ఐదు గ్రాముల నిషేధిత ఎండిఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురు యువకులను అరెస్ట్ చేశారు. మరో వ్యక్తి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.బుధవారం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ జనార్ధన రావు కేసు వివరాలను వెల్లడించారు. ప్రధాన నిందితుడు కోట సంతోష్ కుమార్ బెంగళూరులో హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతున్న సమయంలో డ్రగ్స్ విక్రేతతో పరిచయం ఏర్పడి పలుమార్లు డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు తెలిపారు.తెనాలికి



వచ్చిన తరువాత తన స్నేహితులు గోల్లంట్ల దత్త సాయి మహంత్, రేమాల అజయ్ కుమార్‌తో కలిసి డ్రగ్స్ తెప్పించుకున్నట్లు విచారణలో వెల్లడైంది. సుల్తానాబాద్ వద్ద డ్రగ్స్ వినియోగిస్తున్న సమయంలో పోలీసులకు చిక్కినట్లు తెలిపారు.ముగ్గురు నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## జగన్ పై పత్తిపాటి పుల్లారావు ఫైర్

**చిలకలూరిపేట రక్షణ న్యూస్**



మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు వైసీపీ అధినేత జగన్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసే విధంగా జగన్ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుందని ఆయన ఆరోపించారు.జీవో ఎంఎస్-217 ద్వారా మత్స్యకారుల కడుపుకొట్టారని, పోర్టులు, తీరప్రాంతాలను తన అనుచరులకు కేటాయించినప్పుడు వారి ఉపాధి గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు. మత్స్యకార భరోసా పేరుతో మోసం చేశారని, ఇప్పుడు వారి సంక్షేమంపై మాట్లాడటం రాజకీయ నాటకమని విమర్శించారు.టీడీపీ ప్రభుత్వం మత్స్యకారులకు ఎప్పుడూ అండగా నిలిచిందని, బీమా, డీజిల్ రాయితీ, వేట నిషేధ భృతి, ఫిషింగ్ జెట్టీల నిర్మాణం వంటి చర్యల ద్వారా జీవనోపాధి మెరుగుపరిచిందని తెలిపారు. కాకినాడ, మచిలీపట్నం హార్బర్ల అభివృద్ధితో పాటు కోల్డ్ చెయిన్ వ్యవస్థలను ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుదేనని పేర్కొన్నారు.మత్స్యకారుల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉందని, చంద్రబాబు నిజమైన రక్షకుడని ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు.

# అంబేద్కర్ స్ఫూర్తితో వైద్య సేవలు



'డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డి.యం.పల్లి యూత్ పిలుపునిచ్చింది. అంబేద్కర్ జయంతి సందర్భంగా దగ్గుమల్లి వారి పాలెంలో గుంటూరు కిమ్స్ శిఖర హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గుండె, నరాలు, ఆర్థోపెడిక్, ఊపిరితిత్తు లు, కిడ్నీ, కంటి, దంత సంబంధిత వ్యాధులకు ప్రముఖ నిపుణులచే వైద్య పరీక్షలు నిర్వహించి సుమారు 250 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరదల మహేష్ మాట్లాడుతూ అంబేద్కర్ ఎదుర్కొన్న కష్టాలు ఆయనను వెనక్కు నెట్టలేదని, విద్యపై పట్టుదలతో గొప్ప వ్యక్తిగా ఎదిగారని తెలిపారు. దేశంలో స్వేచ్ఛ, సమానత్వం అంబేద్కర్ కృషి ఫలితమేనని పేర్కొన్నారు. 'బోధించు, సమీకరించు, పోరాడు' అనే ఆయన సందేశాన్ని అనుసరించి సమాజ సేవలో ముందుకు రావాలని, 'పే బ్యాక్ టు ది సొసైటీ' భావనను యువతలో పెంపొందించాలని పిలుపునిచ్చారుగుంటూరు కిమ్స్ శిఖర హాస్పిటల్, వాసన్ ఐ కేర్, వారాహి డెంటల్, నీడ్స్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు మరియు డి.యం.పల్లి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# యువనేతకు ప్రాధాన్యం

**వట్టి చెరుకూరు రక్షణ న్యూస్**



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీలో కార్యదర్శిగా వట్టి చెరుకూరు మండలం చమల్లమూడి గ్రామానికి చెందిన కోడూరి అఖిల్ నియమితులయ్యారు. గతంలో ఆయన రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులుగా పనిచేశారు. ఈ సందర్భంగా కోడూరి అఖిల్ మాట్లాడుతూ తనను ఈ పదవికి నియమించిన పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, ప్రత్తిపాడు శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు, అలాగే ఎమ్మెల్యే ఎంఎస్ రాజులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఇచ్చిన బాధ్యతలకు న్యాయం చేస్తానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# పోలీసుల చాకచక్యం

**పర్చూరు రక్షణ న్యూస్**



పర్చూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరా కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు, కుటుంబ సమస్యల కారణంగా అతని భార్య తన నలుగురు పిల్లలతో ఇంటి నుండి వెళ్లిపోయిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును బాపట్ల డీఎస్పీ శ్రీ చంద్రమౌళి పర్యవేక్షణలో, మార్టూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ బి. నాగభూషణం మార్గదర్శకత్వంలో పర్చూరు ఎస్.ఐ. శ్రీ పులి గోపి నేతృత్వంలో పోలీసులు వేగంగా దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ప్రారంభించారు. పోలీసుల చురుకైన చర్యల ఫలితంగా, ఆ మహిళ మరియు పిల్లలను కృష్ణా జిల్లా మోపిదేవి దేవాలయం సమీపంలో గుర్తించి, కేసు నమోదు చేసిన 24 గంటలలోనే సురక్షితంగా ట్రేస్ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు సమయోచితంగా స్పందించి బాధిత కుటుంబానికి ఊరట కలిగించారు.

# దర్శి అన్నా క్యాంటీన్ ప్రారంభం

**దర్శి రక్షణ న్యూస్**



ప్రకాశం జిల్లా దర్శి పట్టణంలో కురిచేడు రోడ్డులో బుధవారం అన్నా క్యాంటీన్‌ను టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, తహసీల్దార్ శ్రవణ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి-సుబ్బారావు, మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి వర్చువల్‌గా 62 అన్నా క్యాంటీన్లను ప్రారంభించారని తెలిపారు. అందులో దర్శి కూడా భాగం కావడం సంతోషకరమని పేర్కొన్నారు. పేద మరియు మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరలో శుభ్రమైన భోజనం అందించడమే అన్నా క్యాంటీన్ల లక్ష్యమని, ఐదు రూపాయలకే భోజనం అందించడం గొప్ప కార్యక్రమమన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్నా క్యాంటీన్లను నిర్వహిస్తోందని చెప్పారు. ప్రజలందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

**బాపట్ల రక్షణ న్యూస్**



బాపట్ల పురపాలక సంఘం పరిధిలో కమిషనర్ శ్రీ జి. రఘునాధ రెడ్డి గారు బుధవారం ఉదయం ఆకస్మికంగా పలు వార్డులను సందర్శించి పారిశుధ్య పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. జీబీసీ రోడ్, సీబీజడ్ చర్చ్ పరిసర ప్రాంతాలలో జరుగుతున్న శుభ్రత కార్యక్రమాలను సమీక్షిస్తూ, అక్కడి కార్మికులతో నేరుగా మాట్లాడి వారి పనితీరును తెలుసుకున్నారు. ప్రతి రోజు నిర్వహించే పారిశుధ్య పనులపై వివరాలు సేకరించి, పనులు మరింత సమర్థవంతంగా కొనసాగాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన అన్నా కాంటీన్‌ను సందర్శించి, అక్కడ అందిస్తున్న ఆహార నాణ్యతను స్వయంగా రుచి చూసి పరిశీలించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, కాంటీన్ బయట ప్రాంగణంలో గ్రీన్ రూఫ్ మ్యాట్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు, తద్వారా ప్రజలకు సౌకర్యం కల్పించాలని సూచించారు. తదుపరి కమిషనర్ డంప్ యార్డ్‌ను సందర్శించి, అక్కడ జరుగుతున్న చెత్త నిర్వహణ పనులను పరిశీలించారు. శానిటరీ ఇన్స్పెక్టర్ నజీర్ గారిని కార్యకలాపాలపై వివరాలు అడిగి తెలుసుకుని, చెత్త వర్గీకరణ మరియు నిర్వహణలో మరింత సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



# జీవనోఉపాధి శిక్షణ కార్యక్రమం

**బల్లికురవ రక్షణ న్యూస్**

బల్లికురవ మండలంలోని వెలుగు కార్యాలయంలో 2026-2027 సంవత్సరానికి జీవనోపాధుల వార్షిక ప్రణాళిక తయారీకి సంబంధించి వి.ఓ.ఏలు, ఈ-నారి/సి.ఆర్.పిలు మరియు మండల సమాఖ్య ఈసీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో శిక్షణ ఇవ్వగా, రేపు సీసీ క్లస్టర్ స్థాయిలో మరియు అనంతరం వి.ఓ వారీగా సమావేశాలు నిర్వహించి ప్రణాళికలు రూపొందించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి ఈ-నారి/సి.ఆర్.పికి 10 గ్రూపులు కేటాయించి, ఆయా గ్రూపుల సమావేశాల ద్వారా సభ్యుల అవసరాలను గుర్తించి, వారు చేపట్టే జీవనోపాధులకు అవసరమైన రుణ వివరాలను సేకరించనున్నారు. సభ్యులకు అవసరమైన రుణాలను బ్యాంకులు, ఉన్నతి, సామాజిక పెట్టుబడి, స్త్రీనిధి మరియు పొదుపుల ద్వారా అందించనున్నట్లు తెలిపారు. గ్రామ సంఘాల్లో కనీసం 50 శాతం సభ్యులు జీవనోపాధి కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి గ్రామ సంఘంలో కనీసం 15 మంది మహిళా వ్యాపారవేత్తలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కె. రమాదేవి, ఏపీఎం తూమాటి రాజారావు, సీసీలు పేరయ్య ప్రమీల, డేవిడ్, ఏపీజీబీ బల్లికురవ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సునీత గ్రెసీ, అకౌంటెంట్ నాగమల్లేశ్వరి, ఎఫ్‌పీవో సిబ్బంది, స్త్రీనిధి మేనేజర్ నాగశేఖర్, వి.ఓ.ఏలు మరియు ఈ-నారి/సి.ఆర్.పిలు పాల్గొన్నారు



# పిల్లల పోషణపై దృష్టి

**ముండ్లమూరు రక్షణ న్యూస్**

పోషణ పక్షం కార్యక్రమాల భాగంగా ఏప్రిల్ 9 నుండి 23 వరకు "మన పిల్లల అభివృద్ధిని కాపాడుదాం, స్క్రీన్ల నుంచిఅనుబంధాలు--ఆటలపై దృష్టి పెట్టుదాం" అనే నినాదంతో మండలంలోని ముండ్లమూరు-2 సెంటర్ పరిధిలో అంగన్‌వాడి కార్యకర్తలు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు మరియు 0-6 సంవత్సరాల పిల్లల తల్లులతో సమావేశం ఏర్పాటు చేసి, పిల్లల ఆరోగ్యం, పోషణపై చర్చించారు. ముఖ్యంగా పిల్లలకు జంక్ ఫుడ్, శీతల పానీయాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించి, ఆరోగ్యకరమైన ఆహారం ఇవ్వాలని సూచించారు. అలాగే పిల్లలను ఎక్కువగా స్క్రీన్‌లకు దూరంగా ఉంచి, ఆటలపై దృష్టి పెట్టాలని తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ బి. ఇందిరా గారు, ఏఎన్ఎమ్ రాజేశ్వరి, అంగన్‌వాడి కార్యకర్తలు పి. మంజులవాణి, ఎస్. విజయకుమారి, బి. కల్పవల్లి, ఆశా కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.